క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



మంగళగిరి: సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ యు.శారదాదేవి తెలిపారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక అని, సత్వర పరిష్కారమే లక్ష్యంగా పని చేయాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందన్నారు. నగర ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందనలు



మంగళగిరి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.అమూల్య 577 మార్కులు సాధించింది. విద్యార్థినిని సోమవారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సత్కరించారు. విద్యార్థి అమూల్య తమ ఉన్నత పాఠశాలలో టాపర్‌గా నిలవడంతో పాటు మంగళగిరి మండలంలో ద్వితీయ స్థానంలో నిలవడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజీవ్ రత్న పేర్కొన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకానిలో బాలిక అదృశ్యం ఘటన సోమవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. చినకాకాని హాయ్‌ల్యాండ్ రోడ్డులో నివాసం ఉంటున్న కిశోర్, శాన్వి దంపతుల కుమార్తె సోమవారం ఇంట్లో నుంచి కనిపించకుండా వెళ్లిపోయింది. తల్లిదండ్రులు స్థానికులను విచారించినా కుమార్తె ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.

క్రియేటివ్ ఆర్ట్ కిట్ల పంపిణీ

మంగళగిరి: ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి ఆధ్వర్యంలో నగర పరిధిలోని చినకాకాని షైన్ ఆశ్రమ విద్యార్థులకు క్రియేటివ్ ఆర్ట్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి ప్రెసిడెంట్, తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ బ్రాంచ్ చైర్మన్ ఇసునూరు అనిల్ చక్రవర్తి, సెక్రటరీ షేక్ శిలార్, ఈసీ సభ్యులు గాజుల శ్రీనివాసరావు, సభ్యులు అందె మురళి, పారేపల్లి మహేష్ పాల్గొన్నారు.

రాజధాని ప్రాంతంలో లే అవుట్ల పరిశీలన

మందడం(తాడికొండ): తుళ్లూరు మండలం మందడం లే అవుట్‌ను గుంటూరు ఆర్డీఓ ఎం.ప్రభాకర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. హద్దు రాళ్ల ఏర్పాటు లే అవుట్ ప్రక్రియను పరిశీలించిన ఆయన అధికారులతో మాట్లాడి పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలకంపాడులో నివాసముండే ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. పోలకంపాడులో నివాసముండే ఉప్పుగల నాగేంద్రమ్మ(63) మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయరహదారిపై గత సోమవారం ఉండవల్లి సెంటర్ నుండి పోలకంపాడు వెళుతుండగా వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఆమెకు తలకు తీవ్ర గాయం కావడంతో సదరు ద్విచక్రవాహన దారుడు ఉండవల్లి సెంటర్‌లోని ఆర్ఎంపీ దగ్గర వైద్యం చేయించి, బంధువులకు అప్పజెప్పి వెళ్లిపోయాడని, అదే రోజు సాయంత్రం నాగేంద్రమ్మ స్పృహ కోల్పోవడంతో బంధువులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. నాగేంద్రమ్మ కు బ్లడ్ క్లాట్ అయినట్లు నిర్ధారించి చికిత్స ప్రారంభించారని, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందడంతో బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు

ఫిరంగిపురం: ఫిరంగిపురం, తాడికొండ మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ పి.ప్రసూన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండాలపాడు బీసీ-2లో -1, మేరికపూడి పరిధిలోని మునగపాడు బీసీ-1 ఏరియాలో1, బేజాత్పురం -1 పోస్టులకు దరఖాస్తులను 16వ తేదీలోగా ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

నగర పౌరుల భద్రతే లక్ష్యంగా నిఘా

- రూ.32లక్షలతో సీసీ కెమెరాల ఏర్పాటు
- తొలి విడతలో యాభై సెంటర్లలో ఏర్పాటు
- చురుగ్గా సాగుతున్న పనులు



నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం వేస్తున్న స్తంభాలు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో నివసించే పౌరుల భద్రతే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మంగళగిరి, తాడేపల్లిలతోపాటు 21 గ్రామాలతో కలిపి మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ(ఎంటీఎంసీ)గా అవతరించింది. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి వలసలు రావడంతో నగర జనాభా పెరిగింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరపాలక సంస్థ అధికారులు తాగు నీరు, రోడ్లుతోపాటు మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. గత కొద్దికాలంగా కొన్ని ప్రదేశాలలో దొంగతనాలు పెరిగాయి. దొంగతనాలు, నేరాల నియంత్రణకు వెంటనే ఆయా సెంటర్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచించడంతో నగర పాలక సంస్థ అధికారులు, పోలీసు అధికారులు నగర ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుతో పాటు వారి భద్రతే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకుంటుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మంగళగిరి, తాడేపల్లిలలో దొంగతనాల నియంత్రణ, నేరాల నియంత్రణ కోసం నగర పాలక సంస్థ అధికారులు పోలీసులతో సమన్వయం చేసుకుని పౌరుల బద్రత కొరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్రధానంగా సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సుమారు రూ.కోటితో నగరంలో అన్ని సెంటర్‌లతో విలీన గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. తొలివిడతలో మంగళగిరి తాడేపల్లి పట్టణాలలో రూ.32 లక్షలతో యాభై సెంటర్‌లలో యాభై సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ప్రధాన కూడళ్లలో నలుమూలల కవర్ చేసేలా ప్రత్యేకంగా పెద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాల నియంత్రణతోపాటు నేరాలు నియంత్రణ జరుగుతుందని నగర పౌరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తొలి విడతలో 50 కెమెరాలు ఏర్పాటు



ఎమ్మెల్యే ఆర్కే సూచన మేరకు నగరంలో రూ.32 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే పనులను ప్రారంభించాం. మంగళగిరి, తాడేపల్లి పట్టణాలలో తొలి విడతగా 50 సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్నాం. రెండో విడతలో నగరం మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నగర పౌరుల భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– యు.శారదాదేవి, కమిషనర్

నేరాల నియంత్రణ



నగరంలో రోజు రోజుకు జనాభా పెరగుతోంది. నగర పౌరుల భద్రతే లక్ష్యంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి గస్తీలతోపాటు నిరంతర నిఘా ఏర్పాటు చేసి నేరాలను నియంత్రించేందుకు కృషి చేస్తున్నాం. నగరంలోని పలు కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, నేరాలు నియంత్రణలో ఎంతో ఉపయోగపడతాయి.

– జె.రాంబాబు, డీఎస్పీ, నార్త్ జోన్

జగనన్న విద్యా కానుక వచ్చేశాయ్

- దుగ్గిరాలలో భద్రపరిచిన అధికారులు
- పరిశీలించిన ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి



దుగ్గిరాల హైస్కూల్‌లో భద్రపరిచిన జగనన్న విద్యా కానుకలు పరిశీలిస్తున్న అధికారులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందజేసే పాఠ్యపుస్తకాలు, షూ, స్కూల్ యూనిఫాం, బ్యాగ్‌లు, ఇతర స్టేషనరీ ప్రభుత్వం పంపించింది. వాటిని దుగ్గిరాల బాలుర పాఠశాలలో భద్రపరిచారు. జగనన్న విద్యాకానుక మెటీరియల్‌ను దుగ్గిరాల ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, ఎంఈఓ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దుగ్గిరాల మండల పరిధిలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు 4,651 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి సంబంధించి ఇప్పటికే విద్యాశాఖ అధికారులు 16 వేల పాఠ్యపుస్తకాలను, యూనిఫాం మెటీరియల్స్, బ్యాగ్‌లు పంపించారు. వాటిని భద్రపరిచేందుకు దుగ్గిరాల బాలుర హైస్కూల్‌లో ఐదు గదులు కేటాయించినట్లు చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే యూనిఫాం మెటీరియల్ 25 శాతం అధికంగా వచ్చిందని, వాటిని గ్రామాల వారీగా కుట్టించే బాధ్యత వైఎస్సార్ క్రాంతి పథకం అసిస్టెంట్ మేనేజర్ మహాలక్ష్మి అప్పగించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథకం అసిస్టెంట్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పసుపు మద్దతు ధరకే కొనుగోలు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు



ప్రాతూరులో వినతిపత్రం అందజేస్తున్న జొన్నా శివశంకరరావు తదితరులు

తాడేపల్లిరూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా పసుపు పంట వేసిన రైతుల వద్ద పసుపు పంటను మద్దతు ధర రూ.6,850 కొనుగోలు చేయాలని పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు కోరారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి, చిర్రావూరు, వడ్డేశ్వరం గ్రామాల్లో రైతు సంఘం నాయకులతో కలసి రైతు భరోసా కేంద్రాల అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్‌లో కురిసిన అకాల వర్షాల కారణంగా పసుపు పంట దిగుబడి తగ్గిందని, మరలా ఈ సంవత్సరం మార్చి, మే నెలలో కురిసిన అకాల వర్షాల కారణంగా పసుపు కల్లాల్లోనే తడిసిపోయిందని అన్నారు. దీంతో పసుపు పంట పూర్తిగా రంగుమారిపోయి ఎర్రబారడం వలన పసుపు క్వింటా రూ.4,200 నుంచి రూ.5 వేల వరకు వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారని, దీని కారణంగా రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పసుపు రైతులను ఆదుకునేందుకు పసుపు మద్దతు ధర 6,850లకు ప్రభుత్వమే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను, రైతులు డోకిపర్తి రాజేంద్రబాబు, దాసరి రమేష్, కాజా వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి రంగారావు, బిరుదుగడ్డ సుందర్శనరావు, బొప్పన గోపాలరావు, పల్లపాటి సుబ్బారావు, ప్రసాద్, వడ్డేశ్వరం పున్నయ్య, మోదుగుల శ్రీనివాసరెడ్డి, కొర్రప్రోలు ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం పెద్దపీట

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా
- వికలాంగులకు ట్రై మోటార్ సైకిళ్లు అందజేత



మోటారు సైకిళ్లను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, సురేష్ కుమార్

తాడికొండ: విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పేర్కొన్నారు. గుంటూరు భారత్‌పేటలోని తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటారు సైకిళ్ల పంపిణీ సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కులం, మతం, పార్టీ, ప్రాంతం భేదాలు లేకుండా ప్రతి పేదవాడికి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్రం మొత్తాన్ని దోచేశారని, నీరు–చెట్టు పేరిట చెరువులను తవ్వుకొని జేబులు నింపుకోవడంతో పాటు సంక్షేమ పథకాల్లో పచ్చ చొక్కాల వారికే పెద్దపీట వేసి అర్హులను అణగదొక్కారని మండిపడ్డారు. విభిన్న ప్రతిభావంతుల వయో వృద్ధుల రాష్ట్ర అధ్యక్షురాలు ముంతాజ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వికలాంగులకు అన్ని విధాలా అండదండలు అందిస్తున్నారని, రాష్ట్రంలో 1750 మోటార్ సైకిళ్లను వికలాంగులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, మేడికొండూరు మండల ఎంపీపీ మన్నవ స్వప్న పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..



సంక్షేమాన్ని వివరిస్తున్న కత్తెర సురేష్ కుమార్

- వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్
- బేజాత్పురం గడప గడపకు మన ప్రభుత్వం

బేజాత్పురం(తాడికొండ): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను దరిచేర్చడంతో పాటు నేరుగా సమస్యలు తెలుసుకొని పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తాడికొండ మండలం బేజాత్పురంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం తీసుకోని సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకుంటున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడి పేదలకు 35 లక్షల ఇళ్ళ పట్టాలు పంపిణీ చేయడంతో పాటు వాటిలో పక్కా ఇళ్ళు నిర్మిస్తూ దేశంలోనే బెస్ట్ సీఎంగా పేరు సంపాదించాడన్నారు. కోర్టు తీర్పుతో రాజధాని ప్రాంతంలో 54 వేల మంది పేదలకు పట్టాలు పంపిణీ చేసేందుకు వడివడిగా పనులు జరుగుతుండటం హర్షణీయమని, ఇది పేదల చారిత్రాత్మక విజయం అన్నారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కట్టుబడి పనిచేస్తున్నారని, తప్పుడు కేసులతో రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న బాబు మాటలు ప్రజలు ఎప్పటికీ నమ్మరని గుర్తుంచుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, నిడుముక్కల, కంతేరు, పాములపాడు, బండారుపల్లి సర్పంచ్‌లు మాదాసు రత్నకుమారి, బెజ్జం మహేష్ బాబు, బిక్కి శివరామకృష్ణ, ముప్పాళ్ల మనోహర్, మైనార్టీ నాయకులు షేక్ జానీ, స్థానిక నాయకులు వడ్లమూడి రాజేంద్ర, జిల్లా ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి బాకి వెంకట స్వామి, గుంటి రఘువరన్, మాదాసు ఏసురత్నం పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ సభ్యురాలు సెలీనాకు అభినందనలు



డాక్టర్ సెలీనాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) సభ్యురాలిగా డాక్టర్ బీఎస్ సెలీనా నియామకంపై ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజెస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో అకడమిక్ అధికారిగా పని చేస్తున్న సెలీనాను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మోజెస్ మాట్లాడుతూ ఏసీ కళాశాల పూర్వ విద్యార్థిని అయిన డాక్టర్ బీఎస్ సెలీనాను సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఏపీపీఎస్సీ సభ్యురాలిగా నియమించడం ద్వారా విద్యారంగంలో ఆమె సాధించిన అపారమైన అనుభవానికి తగిన గుర్తింపు ఇచ్చారని తెలిపారు. సెలీనా తండ్రి బి. చంద్రపాల్ ఏసీ కళాశాల ప్రిన్సిపాల్‌గాను, ఆమె తల్లి సూజన్ ప్రమీల బోటనీ అధ్యాపకురాలిగా పని చేశారని చెప్పారు. ఈసందర్భంగా డాక్టర్ సెలీనాకు కళాశాల కరస్పాండెంట్, మోడరేటర్ బిషప్ డాక్టర్ కేఏఫ్ పరదేశి బాబు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎం.ఎస్ శ్రీధర్ పాల్గొన్నారు.

అనాథ విద్యార్థినులకు అభినందనలు

గుంటూరు మెడికల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఏ గ్రేడ్ సాధించిన ఏటుకూరులోని అనాథ ఆశ్రమ పిల్లలు బొల్ల భువన, కృతిలను సోమవారం అల్బినా చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు జాలాది సెల్వరాజ్, మేరి అభినందించి, వస్త్రాలు బహూకరించారు. విద్యార్థినుల ఉన్నత చదువుకు ట్రస్టు తరఫున సాయం అందిస్తామని వెల్లడించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

మేడికొండూరు: మండలంలోని పాలడుగు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో నవధాన్యాలు , పప్పు దినుసులు, చిరుధాన్యాలు, నూనె గింజలు, పచ్చిరొట్టె ఎరువులు వాడటం వలన కలిగే ఉపయోగాలను ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన చేశారు. వ్యవసాయంలో ఎరువులు, పురుగు మందుల వినియోగంపై ఎదురయ్యే నష్టాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా ప్రకృతి వ్యవసాయంలో ధాన్యం గింజలు వినియోగించడం వలన భూసారం పెరుగుతుందని తెలిపారు. ఒక ఎకరానికి 12 నుంచి 15 కేజీల వరకు 30రకాల విత్తనాలను భూమలో చల్లుకోవాల్సిందిగా పీఆర్పీ రామకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సోమవారం ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి చిలువూరు వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం రజనీకాంత్, మొగలి మధు, హేమర్తి రాజశేఖర్, జాన్సన్, సిలోమీన, నెమలికంటి బాబూరావు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడి గ్రామానికి చెందిన ఓ హృద్రోగికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని సోమవారం ప్రకటించారు. సహాయాన్ని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చలంచర్ల రామకోటిరెడ్డి, నలకుర్తి యేసుపాదం, పిల్లి ధర్మరత్నం, నూతక్కి కోటేశ్వరరావు, కాబోతు కర్నూరావు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఎంపీపీ సంతోషరూపవాణి

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటోందని, రైతులకు మద్దతు ధర ప్రకటించి మొక్కజొన్న, జొన్న పంటను కొనుగోలు చేస్తుందని ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి అన్నారు. సోమవారం దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని సొసైటీలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్వరి, సొసైటీ చైర్మన్ నలుకుర్తి ఏసుపాదం, మండల వ్యవసాయ అధికారిణి శిరీష, వ్యవసాయ విస్తరణ అధికారి ఎ.రమేష్‌బాబు, వీఏఏలు రఫి, ప్రియాంక, వీఆర్ఏలు బుల్లెమ్మాయి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్ జ్ఞానదివ్యకు సత్కారం



తెనాలి రూరల్: తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందిన పవర్ పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్యకు తెనాలిలో ఘన స్వాగతం లభించింది. కేరళ రాష్ట్రం అలెప్పిలో జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని నాలుగు సిల్వర్ పతకాలు సాధించిన ఆమెకు సోమవారం ఉదయం తెనాలిలో పలువురు స్వాగతం పలికి అభినందించారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉదయం జరిగిన స్వాగత కార్యక్రమంలో కఠెవరం గ్రామస్తులతో పాటు నందివెలుగు గ్రామానికి చెందిన మేము సైతం సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడంపై అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మేము సైతం సంస్థ సభ్యులు ఎం.జగన్మోహనరావు, షేక్ షకూర్ బాష, కళ్యాణం నరసింహారావు, విష్ణుమొలకల నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

చిలువూరులో వేసవి వినోదం శిక్షణ



వేసవి వినోదం కార్యక్రమంలో చిన్నారులతో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి ప్రసాద్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరులోని కేవీఎస్ఎస్ అండ్ కేఆర్ఆర్ స్కూల్‌లో వేసవి వినోదం శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి వల్లభాపురపు ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వేసవి వినోదం అనేది పిల్లల్లో కొత్త ఆలోచనలకు పురుడు పోసుకునేందుకు, వారిలో దాగి వున్న సృజనాత్మక శక్తులను వెలికితీసేందుకు దోహదపడతాయని అన్నారు. అనంతరం చిన్నారులకు రంగు కాగితాలతో వివిధ రకాల పూలు, బొమ్మలు, గ్రీటింగ్ కార్డులు తయారు చేయడం నేర్పించారు. వివిధ రకాల ఇంద్రజాల అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారి చేత ప్రదర్శింపజేశారు.

ఫిరంగిపురంలో..

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. అల్లంవారిపాలెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం డానియేల్ మాట్లాడుతూ 40రోజులపాటు నిర్వహించే శిక్షణలో విద్యార్థులకు కథలు చదవడం, చెప్పడం, రాయడం, డ్రాయింగ్, థియేటర్‌లో శిక్షణ వంటివి ఇవ్వడం ద్వారా వారిలో సృజనాత్మక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సత్యశిరీష పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.త్యాగరాజు, సీహెచ్ రమణారెడ్డి, పి.ప్రసాద్, ప్రభుదాస్, సీహెచ్‌వీ రాజు, బల్తరాజ్ పాల్గొన్నారు.

పొన్నెకల్లు గ్రామసభ వాయిదా



మాట్లాడుతున్న పొన్నెకల్లు గ్రామ సర్పంచి నూకతోటి మేరిమ్మ

పొన్నెకల్లు(తాడికొండ): తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామసభ వాయిదా పడింది. గ్రామంలో ఉన్న మద్యం దుకాణం బండారుపల్లి గ్రామానికి తరలించడంపై గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలని వచ్చిన ఆదేశాల మేరకు గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో మహిళలు గ్రామంలో మద్యం దుకాణం వద్దంటూ గ్రామ సభ దృష్టికి తీసుకొచ్చారు. కొంతమంది ఇంత పెద్ద గ్రామంలో దుకాణం ఎత్తివేయడంతో బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామసభ వాయిదా వేస్తున్నట్లు సర్పంచి నూకతోటి మేరిమ్మ ప్రకటించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి పల్లా విజయలక్ష్మి, కార్యదర్శి షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

దుర్గగుడి చైర్మన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

మంగళగిరి: విజయవాడ దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబుపై జనసేన నాయకుడు పోతిన మహేష్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని భగీరథ సగర సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ పోతిన మహేష్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జూట్రు ఏడుకొండలు, కర్నాటి శివ సత్యనారాయణ, గండికోట రాజరావు, కలవకొల్లు గోపిబాబు, కగ్గా శ్రీనివాసరావు, రెడ్డి రాఘవ పాల్గొన్నారు.